
'హలో... హల్లో... ఆ... నేనే... నారాయణ శాస్త్రినయ్యా బాబూ! ఆ... అవును... అడ్డా నుంచే మాట్లాడుతున్నా... ఆ... ఆ... వెంకటేశం సేటుగారా? ఆ... గుర్తుంది. ఇవ్వాళ మీ నాన్నగారి ఆబ్దికం గదా! ఆ...ఆహా... కరెక్టే... అపరాహ్నం కావాలిగదా! ఆ... మా అసిస్టెంట్ మీ తద్దినం పెట్టేందుకు... ఆహా... అదే మీ నాన్నగారి ఆబ్దికం కోసం... పన్నెండులోగా మీ ఇంట్లో ఉంటాడు. సుబ్బరంగా పిండ ప్రదానం చేయిస్తాడు. మీ ఏర్పాట్లు మీరు చేసుకోండి. ఆ... ఆ... అయ్యో... ఎంత మాటా! శ్రాద్ధకర్మ శాస్త్రబద్ధంగా జరుగుతుంది. ఆ... సరే... సంభావన మాత్రం సాయంత్రం మీ మనిషితో నేరుగా మా ఇంటికి రావాలి. ఆ... తెలుసుగదా! సరే... ఉంటాను...

సెల్‌ఫోన్ ఆపేసి స్టయిల్‌గా నవ్వుకుంటూ ఈ లోకానికొచ్చాడు నారాయణశాస్త్రి.

శాస్త్రసాంకేతిక యుగంలో శాస్త్రాలను నిర్వచించే పురోహితుల అడ్డా అది. అడ్డా హెడ్డు నారాయణశాస్త్రి. గుమ్మడిపండులా వుంటాడు. తాహతుకు మించిన శరీరభారాన్ని స్వయంగా భరిస్తున్నాడు. పావుకిలో వంకాయ లకు అరకిలో గరంమసాలా దట్టించి, గుత్తి వంకాయ కూర వండించినట్టు తనకున్న పిడికెడంత పౌరోహిత్యం శక్తికి దోసెడంత యుక్తి జోడించి, సిటీలో పేరున్న పురోహితు డుగా అర్థం, పరమార్థాలను సాధించుకుంటు న్నాడు. కాలుమీద కాలాడిస్తూ, సెల్‌ఫోన్ జేబు లో వేసుకున్నాడు. కూచున్న పడక్కుర్చీ అప్పటికే



# బతుకు బాట

## ఐతా చంద్రయ్య

రెండు మూడుసార్లు కుయ్యోమొర్రో అంది. బుర్రలో ఆలోచనలు బురిడీలు కొడ్తుంటే చూపులు సీలింగ్ ఫ్యాన్‌మీదున్నాయి. డిటర్జెంట్ సబ్బు అడ్వర్టయిజ్‌మెంటు దృశ్యంలా తెల్లని ధోవతి, సిల్క్ లాల్చీ, నుదిటి విభూతిరేఖల మధ్య గుండ్రని చందనంబొట్టు అరుణాకాశంలో సూర్యోదయంలా మెరుస్తోంది. భుజమ్మీంచి వేళ్లాడ్తున్న కాశ్మీరీ శాలువా జరీఅంచు ఫ్యాన్‌గాలితో సయ్యాటలాడుతోంది.

సిటీ నడిబొడ్డులో చౌరస్తా. చౌరస్తాలో అద్దాగది. అద్దాగదిలో ఎదురుగోడకు ఆదిశంకరాచార్యుల రంగుల చిత్రం నాలుగ్గోడల మధ్య జరిగే హంగుల వ్యవహారాలన్నింటికీ ప్రత్యక్ష సాక్షిగా వేళ్లాడుతోంది.

వేదపాఠశాలలో వేదాచార్యుని ముందు వేదాచార్యుల్లా అసిస్టెంట్స్ అనబడే నలుగురు గుమస్తాలు చేతులు కట్టుకుని మంచున్నారు. పంచకట్టు, భుజమ్మీద సాదా కండువా, పిలకజుట్టు, నుదిటి విభూతిరేఖల మధ్య ఎర్రని కుంకుమబొట్టు... స్కూలు యూనిఫారాల్లా నలుగురి వేషధారణా ఒకేరకంగా ఉంది. కాయకష్టం తెలియదు, చదువుపరంగా సర్కారు ఉద్యోగానికి అన్ని అర్హతలున్నాయి. అయినా సామాజికంగా ముందున్నారు కాబట్టి ఉద్యోగ సాధనలో వెనుకబడ్డారు. కుంచించుకుపోయిన అవకాశాలను నిందిస్తూ కూచుంటే ఆకలి ఆగదు కదా! పొట్టకూటి కోసం జెర్రిపోతుల నాడించలేరు. కాబట్టి శ్రమశక్తిని నమ్ముకుని పౌరోహిత్యాన్నాశ్రయించక తప్పలేదు. పౌరోహిత్యం ప్రైవేటు ఉద్యోగమే గాని, అది కూడా అల్లాటప్పాగా దొరకదు. దొరికినా తుమ్మితే ఊడిపోయే ముక్కులా దినదినగండంగా నడుస్తుంది. గురువుగారైన నారాయణశాస్త్రి కనుసన్నల్లో కుక్కినపేనులా, కిక్కురుమనకుండా పడున్నన్ని రోజులూ ఉద్యోగానికి ఢోకాలేదు. ఏమాత్రం తేడావచ్చినా బతుకుదారి గోదారే. అదేభావం నలుగురిలో నలిగిపోతోంది.

ఇన్‌స్టంట్ కాఫీలా అప్పటికప్పుడే కిల్లీ తయారుచేసుకుని, దవడకు దట్టించుకున్న గురువుగారి హావభావాలను వినయ విధేయతలతో కనిపెడుతూ సైనికుల్లా నుంచున్నారు. నారాయణశాస్త్రి ముందుకులేచి నిటారుగా కూర్చున్నాడు. పడక్కుర్చీ కిర్రమంది. జేబులోని సెల్‌ఫోన్ గుర్రమంది.

"హల్లో... ఆ... నేనే. అవునవును... ఆ పెళ్లి ముహూర్తం పదింటికి గదా!... గుర్తుంది. ఇప్పుడెనిమిదైందిగదా! నా సీనియరసిస్టెంటు ఇప్పుడే బయల్దేర్తాడు... ఆ... అబ్బే! ఆలస్యమేం లేదు. అరగంటలో పెళ్లిపందిట్లో వుంటాడు. అతడా! వేదం చదివినవాడండీ!... అబ్బే... మీరంతగా చెప్పాలా! ఆ... సరే... అలాగే. సరే... రేపు నేనే స్వయంగా వచ్చి నూతన వధూవరులను శాస్త్రోక్తంగా ఆశీర్వదించి మీ సన్మానసత్కారాలందుకుంటాను. ఆ... ఓకే... రైట్..." సెల్‌ఫోన్ జేబులోకి దూకేసింది.

శాస్త్రి నిశితదృక్కులు శిష్యుల్ని పరకాయిస్తున్నాయి. కళ్లల్లో అసహనం పేరుకుపోతోంది.

"ప్చ్... టైం... ఎనిమిదైపోయింది" కిళ్లీని కసిగా కొరికేసాడు. 'రవీశ్వర్‌గాడేడిరా?'

నలుగురి నేలచూపులు, తలఊపులు తెలియదని చెప్పేసాయి.

"వెధవలు... ఏడున్నరలోగా అడ్డామీదుండాలని గెడ్డంపట్టుకుని చెప్పినా తెడ్డుచూపిస్తున్నారు. ఛీ... ఛీ... క్రమశిక్షణలేని బతుకు కడు హీనమని ఎన్నిసార్లు చెప్పినా వినరుగదా!"... కిళ్లీ మరో దవడకు మారింది. అసహనం పెరిగి అతలాకుతలం చేస్తోంది.

బజారులో జనసంచారం పెరిగిపోతోంది.

"రోజూ పనివున్నా, లేకపోయినా నెలజీతం ఠంచన్‌గా అందుకుంటున్న వెధవాయిలకా మాత్రం జ్ఞానముండాలిగదా!" గొణుక్కుంటున్నాడు. "ఉద్యోగమడిగేటప్పుడు ఆడినమాట తప్పని హరిశ్చంద్రుడిలా వినయ విధేయత లొలకబోస్తారు. పట్టుమని పది పదిహేను పనులకెళ్లొస్తే తొండముదిరి ఊసరవెల్లి అయినట్టు ఫెలుసైపోతారు. ఛిఛీ..." సెల్ బుర బురలు రుసురుసలనద్దుకుంది. సత్యనారాయణవ్రతమని సంప్రదించారెవరో.

పక్క కిటికీ ఊచల్లోంచి లంఘించుకొచ్చిన సూర్యకిరణాలు కళ్లమీద తచ్చాడుతున్నాయి. కుర్చీతోసహా పక్కకు జరుగుతూంటే అది అయ్యో...అయ్యో... అని అరిచింది.

ఈ వెధవల్ని వెంటనే పంపించాలి. ఆ వెధవన్నర వెధవ రవిగాడొచ్చాక ఆబ్దికానికి పంపిస్తే సరిపోతుంది. ఒకవేళ వాడు రాకపోతే...?! తద్దినానికి నేనే స్వయంగా వెళ్లాలి. అమ్మో... నా తద్దినానికొస్తుంది. ఆ... రవిగాడు కడుపు తిప్పలకోసం పంజేస్తుండు. రాకేంజేస్తడులే!... చూపులు సీనియరసిస్టెంటు మీద నిలబడిపోయినై... వీడు వేదం చదివిండు. తొక్కుడుబండకున్నంత ఓపిక ఉంది. తిట్టినా, చీదరించుకున్నా కిమ్మనడు. చలిమిడి ముద్దలా గుండిపోతడు.


"నాయనా! నువు వెంటనే బయలుదేరి పెళ్లి చేయించిరా. కన్యాదానం బాపతు సంభావన లాంటివన్నీ జాగ్రత్తగా తెచ్చి నాకప్పజెప్పాలని తెలుసుగదా!"

"తెలుసండీ!" సీనయరసిస్టెంటు సవినయంగా నమస్కరించి, బయలుదేరాడు. రెండోవాణ్ని అక్షరాభ్యాసానికి, మూడోవాడ్ని సత్యనారాయణ వ్రతానికి, నాలుగోవాణ్ని అభిషేకానికీ పురమాయించి, ఊపిరి పీల్చుకున్నాడు. ఆబ్దికం టెన్షన్ అలాగే ఉండిపోయింది.

* * *

"రవీ... రవీశ్వరా... ర...రవీ!" కుక్కిమంచంమీద కుక్కినపేనులా పడున్న గోవింద శర్మలో ఆయాసం. కొడుకును పిలుస్తూంటే గుండెలెగిరిపడుతున్నై. పేదరికం సతాయింపుల్ని తట్టుకోలేక ప్రౌఢత్వం ప్రారంభదశలోనే వృద్ధాప్యం దాపురించింది. మూడేళ్ల నుంచి ముదురుతున్న దగ్గు - దమ్ము నులకమంచానికి పరిమితం చేసింది. కుక్కిమంచం కిర్‌కిర్‌లకు గొంతులోని గురగుర తోడై రౌరవనరకం చూపిస్తోంది. ఆ చావేదో త్వరగా వచ్చి ఛస్తే బాగుండు. తనమీద తనకే అసహ్యమేసి విసుక్కుంటున్నాడు.

దేశానికి పల్లెటూళ్లు పట్టుగొమ్మలన్నారు. వర్షాలు కరుణించి, పాడిపంటలు సరిగా ఉన్నన్ని రోజులూ అది నిజమే అన్పించింది. ప్రాజెక్టులకు నోచుకోక తాగు-సాగు నీరు కరువైన ప్రాంతాలలోని జనాల అంగలార్పుల నాలకించే నాథుడేలేడు. ఎన్నికలప్పుడు వాగ్దానాల, వరాల వర్షం, వారుణివాహిని, డబ్బు పంపకాలు అరచేతిలో స్వర్గం చూపించి,




మాయమైపోతాయి. ఏడాదిలో ఆరునెలలు ఎండాకాలం మండిపోతుంది. చెరువులు, బావులు, పొలాలు నోళ్లు తెరచి పడున్నై. సాగు నీరు దేవుడెరుగు... తాగునీటికే దిక్కులేదు. ప్రజాప్రతినిధులు వంది మాగదులతో పల్లెబాట కార్యక్రమాలు అట్టహాసంగా నిర్వహిస్తూ ప్రజా ధనాన్ని నీళ్లప్రాయంగా ఖర్చుచేస్తున్నారు. కన్నీళ్లు తప్ప వర్షం నీళ్లు దొరక్క సన్నకారు రైతులు పశువుల్ని వధశాలలకు అమ్మేసి, బరువెక్కిన గుండెలతో పొట్టచేతపట్టుకుని నగరబాట పడుతున్నారు. పల్లెల్లో పచ్చదనం విచ్చుకుంటేనే ధార్మిక కార్యక్రమాలు జరుగుతుంటాయి. నిత్య పూజలు, ధూపదీప నైవేద్యాలు లేక దేవుళ్లే కరువు రక్కసి ఉక్కుపాదాల క్రింద నలిగిపోతుంటే, దేవుళ్లను నమ్ముకున్న బ్రాహ్మణులకు బతుకు దెరువెక్కడిది? కఠోర నియమాలు పాటిస్తూ, ఏడేళ్లు వేదాన్నభ్యసించిన రవీశ్వరశర్మ పరిస్థితి తుఫానులో చిక్కుకున్న పసిపాపలాగైంది.

తండ్రి దీనావస్థ చూడలేక తల్లి స్వర్గారోహణం చేసింది. ఇద్దరు పిల్లల ఆకలి చూపులు, ఇల్లాలి బేలతనం గుండెల్లో చిచ్చుపెట్టినై. తన ప్రాణాలతో పాటు వాళ్ల ప్రాణాలు కూడా నిలబడాలనే పట్టుదల బలపడింది. బతుకుబాటలో ఆకలి ఆరాటం నగరబాటలో నడిపించింది. నవనాగరికత సంతరించుకున్న జనారణ్యంలో ఒంటరి పోరాటానికుద్యమించాడు. పరిస్థితుల ప్రాబల్యం దూరబ్బందువు నారాయణశాస్త్రి పాదాల నాశ్రయించి తీరాలంది. అతడే యజమాని, గురువు.

లేబర్ కాలనీలో రేకుల అద్దిల్లు దొరికింది. తూరుపు ఆకాశాన వెలుగురేఖలు విచ్చుకోకముందే నిద్రలేవడం, జీరోబల్బు వెలుతురులో కాలకృత్యాలు, నిత్యపూజలు ముగించుకోవడం, భార్య అందించిన వేడిఛాయ్‌నీళ్లు గొంతులో పోసుకోవడం, ప్రాణాలరచేతిలో పెట్టుకుని పాతసైకిలెక్కి అడ్డా చేరుకోవడం, నారాయణ శాస్త్రి ఆదేశాలను అక్షరాలా అమలుచేసి, ఏ రాత్రికో ఇంటికి చేరుకోవడం అలవాటైంది.

కన్నతండ్రి అనారోగ్యం వల్ల ఆ రోజు ఆలస్యమైంది. అప్పుడే తెల్లారిపోయింది. అయినా తయారయాడు. తండ్రినలా వదిలేసి వెళ్లాలంటే మనసొప్పలేదు. కాని పరిస్థితి పట్టుబట్టి ఒప్పించింది. గ్లాసెడు నీళ్లు తాగించి, గమ్మునూరుకున్నాడు.

"ఇప్పుడెలా వుంది నాన్నా!" ఖాళీ ఛాయ్ గ్లాసు భార్యకందించి, తండ్రి పక్కన కూర్చున్నాడు.

"నా... రోగం... బాగా బలిసిపోయిందిరా" కొడుకు చేతులందుకున్నాడు గోవిందశర్మ. ఇదేదో పాత రోగమన్నాడుగదా... వైద్యుడు. హ... హ... హయ్యో..." దగ్గుతెర. పొత్తికడుపు తోలుతిత్తిలా ఎగిరిపడుతోంది. తండ్రి కడుపు మీద అరచేత్తో రాస్తూ –

"నిజమేకానీ నాన్నా! ఈ ఆధునిక యుగంలో వైద్యానికి లొంగని రోగం లేదు. ఇవ్వాళ మా శాస్త్రిగారినో నెల జీతం అడ్వాన్స్ ఇవ్వమంటాను. నిన్నో పెద్ద డాక్టరుకు చూపిస్తా..." మాటల ధైర్యం నూరిపోసాడు.

* * *

"ఏంరా రవీ! నీ పేరేమిటి?" నారాయణ శాస్త్రి గొంతులో వింత గమకం, కళ్లల్లో కాఠిన్యం.

తనను తానోసారి కిందనుంచి మీద్దాకా చూసుకుని ధోవతి సవరించుకున్నాడు రవీశ్వర శర్మ.

పేరుతో పిలిచి, పేరడుగుతాడేమిటీ? తప్పకుండా అది కోపతామమే! వెన్నుపూసలో సన్నని వణుకు చోటుచేసుకుంది. తల నేలకేసి, చేతులుకట్టుకునుంచున్నాడు.

"న్నా... నాపేరు రవీశ్వరశర్మండీ! మా నాన్న అనారోగ్యం... సవినయంగా సంజాయిషీ ఇవ్వబోయాడు.

"నోర్ముయ్ వెధవాయ్! మీ నాన్నో చక్రవర్తి. నువ్వో రాజారవివర్మవనుకుంటున్నావా? ఇంతసేపు ఏ రాజ్యమునేలుతున్నట్టో!" కిళ్లీ నోటినిండా వెటకారం.

"న్నే...ను... మీ అసిస్టెంటుని, శిష్యుణ్ణి. పేద బ్రాహ్మణ్ని... కాళ్లలోని భయం కడుపులో కెళ్లింది. అడ్డాకొద్దామని తయారవుతూంటే మా నాన్న దగ్గు – దమ్ము రోగం తిరగబెట్టిందండీ. రాత్రి నుంచి ఒకటే దగ్గు, ఆయాసం. నాకు భయమైతుంది. వెంటనే స్పెషలిస్టు డాక్టరుకు చూపించాలి, నర్సింగ్‌హోమ్‌లో చేర్పించాలి..."

"ఆహా! అయితే కారులో హైదరాబాద్ తీసుకెళ్లి నిమ్స్‌లో చేర్పిస్తావా? లేక విమానంలో ఢిల్లీకి తీసుకెళ్లి ఎయిమ్స్‌లో చూపిస్తావా?" మాటలు ఈటెల్లా దూసుకొస్తున్నాయి. కిళ్లీరసం తుంపరతుంపరగా బయటపడుతోంది. కనుగుడ్లు ఎర్రగచ్చకాయల్లాగున్నై.

రాత్రంతా సరిగా నిద్రలేక తన కళ్లేమో చిన్నవైపోతున్నై. గుడ్లల్లో నీటిపొరలు కమ్ముకుంటున్నై. ఈ సమయంలో అడ్వాన్సడిగితే పళ్లు పటపటలాడిస్తూ పేరిణో... శివతాండవమో చెయ్యొచ్చు. పేదవాడి రోషం పెదవికి చేటు.

"క్షమించండి. ఆలస్యమైంది" కండువాతో కళ్లద్దుకున్నాడు. "ఇప్పుడెటువెళ్లాలో, ఏం చెయ్యాలో చెప్పండి" దొంగతనం చేస్తూ పట్టుబడ్డట్టు చూపులు నేలను తడుముతున్నాయి. గుమ్మంలోంచి చొచ్చుకొచ్చిన ఎండ తీవ్రత వీపుమీద చురుక్కుమంటోంది. రోడ్డుమీద వాహనాల రొద. జనసంచారం పెరిగిపోయింది. కోపం చల్లారిపోతోంది.

"మరోసారి ఆలస్యమైతే ఉద్యోగం ఊడిపోద్ది, జాగ్రత్త! నిన్న మన అడ్డాకొచ్చిన వెంకటే

శం ఇల్లు తెలుసా?"

"తెలుసండీ... చాలా దూరం..."

"దూరాభారమంటే పౌరోహిత్యానికి పనికి రావు. సైకిలుందిగదా! వాళ్లింట్లో తద్దినం. దర్భకర్రలతో వెళ్లు. వంటచేసుకుని అక్కడనే భోంచెయ్".

సిటీ బయటకెళ్లి దర్భకర్రలు సేకరించాలి. అంతదూరం డొక్కుసైకిల్‌మీద వెళ్లి, పిండ ప్రదానం చేయించి, వండుకుని, తిని వచ్చేసరికి నాన్న ఆరోగ్యమెట్లా ఉంటుందో! అదేమాట చెప్పి, తద్దినానికెళ్లడం వీలుకాదంటే నాకు తద్దినం పెట్టడం ఖాయం. భారమంతా భగవం తునిదే!

'సరేనండీ...' మనసు వెనక్కు లాగుతూంటే మనిషి కాళ్లు ముందుకు బయలుదేరదీసినై. పిలక సవరించుకుంటూ బయటకు వచ్చాడు.

వెంకటేశం ఇంటికెళ్లేసరికి మిట్టమధ్యా హ్నామైంది. ఎండ నిప్పులు కక్కుతోంది. అరిగి రంధ్రాలు పడిన హవాయి చెప్పులతో నేలమీద అడుగులేస్తుంటే నిప్పులమీద నడుస్తున్నట్టుంది. అన్నీ భరిస్తేనే అన్నం దొరుకుతుంది. లేకపోతే బతుకు సున్నా ఐపోతుంది. నెలజీతంతో ఎంత కష్టపడ్డా శ్రమశక్తి విలువ ఇంతే.

నాన్న ఆరోగ్యమెట్లుందో? నేను వెళ్లేసరికి ఎట్లా ఉంటాడో? నారాయణశాస్త్రి ఆ మాత్రం ఉద్యోగమిచ్చాడు కాబట్టి సరిపోయింది... నిరాశా నిస్పృహలనణిచిపెట్టి, పిండప్రదానం చేయించాడు. వంట చేసుకుని తిని, తిరిగి నారాయణశాస్త్రి ఇంటికొచ్చేసరికి సాయంత్ర మైంది. అప్పుడడిగాడు అడ్వాన్సు.

ఆ రోజు కలక్షన్స్ పక్కన కూచున్న భార్య కందిస్తున్న శాస్త్రి "అదెట్లా తీరుస్తావటా?" అడిగాడు.

శిష్యుని చూపులు గురువుగారి భార్యను బతిమాలాయి.

"ముందు వానికి డబ్బిచ్చి పంపండి..." భార్య ఆదేశం.

పాపం... పేదబ్రాహ్మడు. పైగా వాని తండ్రి ఆవిడకు పెదనాన్న కొడుకు. వాళ్లు... అన్నా చెల్లెళ్లు. ఉద్యోగమిప్పించింది కూడా ఆ బంధు త్వమేనాయె. సైగలతో సరేనన్నాడు శాస్త్రి. అవిడే నోట్లు లెక్కపెట్టి రవీశ్వరశర్మ చేతికం దిస్తూ -

"తొందరగా వెళ్లి మా అన్నయ్యను హాస్ప టల్‌కి తీసుకెళ్లరా" తొందరపెట్టింది.

శక్తినంతా కూడదీసుకుని సైకిలెక్కాడు. ఆయాసం బుసలుకొడుతూంటే సైకిల్ ట్యూబు తుస్సుమంది. పంక్చర్ రిపేరు చేయించుకునే సరికి చీకటిపడింది. వీధిలైట్ల వెలుతురు నగర సుందరి ఒంటినిండా పరుచుకుంది. బుర్ర పొరల్లో ఆలోచనలు బురిడీలు కొడుతున్నాయి. ఇంటికెళ్లగానే నాన్నను నర్సింగ్‌హోమ్‌కి తీసుకె ళ్లాలి. ఈ డబ్బు సరిపోతుందో లేదో! సరిపో కుంటే ఏం చెయ్యాలి? ఏం చెయ్యాలి?... ఏం చెయ్యాలి?...

ఎదురుగా పాత సామానులతో లారీ పరుగెత్తుకొస్తోంది. రవీశ్వరశర్మ ప్రశ్నకు సమా ధానం దొరకలేదు. లారీ బ్రహ్మరాక్షసిలా రావ డం గమనించే స్థితి లేదు. పాత సామానుల లారీ పాతసైకిల్‌ని గుద్దేసి పరారైపోయింది. డొక్కుసైకిల్ డొక్క చీలిపోయింది. సవారి ఎగిరి పడ్డాడు చౌరస్తాలో...

"అమ్మా... నాన్నా...! రవీశ్వరశర్మ గుండె ల్ని చీల్చుకుని వచ్చిందో కేక.

అది చావుకేకో, గావుకేకో అర్థంకాక నగర సుందరి నివ్వెరబోయింది. ●